క్లుప్తంగా

రేపు శని దోష పరిహార పూజలు



పూజలందుకుంటున్న మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: శనీశ్వర జయంతిని పురస్కరించుకుని గురువారం మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో శని దోష పరిహార పూజలు చేపడుతున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవ రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శనీశ్వరమూర్తికి తైలాభిషేకం, శాతిహోమం నిర్వహిస్తామన్నారు. ఈ యేడాది అర్ధాష్టమ, అష్టమ, ఏలినాటి శని దోషములతో బాధలు, కష్టాలు, అనారోగ్యం తదితర సమస్యలను అనుభవిస్తున్న కర్కాటక, సింహ, తుల, మకర, కుంభ, మీన రాశుల వారికి శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధానంలో మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ శ్రీపాదుల వారి ఆదేశాల మేరకు దోష పరిహార పూజలు చేస్తున్నట్లు తెలిపారు. దోష పరిహార పూజలు చేయించు కోదలచిన భక్తాదులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



మురుగు కాలువలో పూడికను తొలగిస్తున్న కార్మికులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపడుతున్నట్లు కార్యదర్శి శివప్ప, సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించి డంప్‌యార్డుకు తరలిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఎక్కడా చెత్తచెదారం లేకుండా చూడలన్న లక్ష్యంతో నిత్యం పారిశుద్ధ్య సిబ్బందితో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం వైఎస్సార్ సర్కిల్, దర్గా ఏరియాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు వారు వెల్లడించారు.

నాగలాపురంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన



గుమికూడి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

ఆదోని రూరల్: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో విధించిన నిబంధనలు అతిక్రమించి ప్రజా జీవితానికి ఇబ్బంది కలిగించేలా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సంబరాలు చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని నాగలాపురం, కుప్పగల్, బల్లేకల్, పాండవగల్లు, దిబ్బనకల్, నెట్టేకల్, మదిరె తదితర గ్రామాల్లో పోలీస్‌యాక్ట్ 30, 144 సెక్షన్ అమలులో ఉంది. ఎలాంటి సంబరాలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టరాదని, బాణసంచా పేలర్చరాదని ఈ నెల 6వ తేదీ వరకు నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ నిబంధనలు అతిక్రమించి కూటమి నాయకులు, కార్యకర్తలు ఆదోని మండలంలోని నాగలాపురం, కుప్పగల్, బల్లేకల్, పాండవగల్లు, దిబ్బనకల్, నెట్టేకల్, మదిరె తదితర గ్రామాల్లో డ్రమ్ములు, డీజేలు పెట్టుకుని భారీ ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు, పోలీసు చట్టాలు ఎక్కడా పాటించకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్, నిబంధనలపై వారం రోజులపాటు పోలీసుశాఖ మైకులు, మీటింగ్‌లు పెట్టి చెప్పినప్పటికీ టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో ఎలాంటి మార్పు లేకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

అనుమతిలేని విత్తనాలు విక్రయించరాదు

మద్దికెర: ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు విక్రయించరాదని ఏఓ రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫర్టిలైజర్స్ షాపు యజమానులు తప్పనిసరిగా రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని అందులో డీలర్ సంతకం, బ్యాచ్ నంబర్, లాట్ సంఖ్య, ముగుస్తున్న తేదీతో పాటు రైతు సంతకం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా విజయం

మంత్రాలయం: ఆధ్యాత్మికపురి మంత్రాలయం నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేసిన వై.బాలనాగిరెడ్డి అఖండ విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి టీడీపీకి చెందిన ఎన్.రాఘవేంద్ర రెడ్డిపై ఆయన 12,805 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మంగళవారం ఓట్ల లెక్కింపు ముగిసిన అనంతరం ఎమ్మెల్యే తరఫున వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్ రెడ్డి నియోజకవర్గ ఆర్‌ఓ చేతులమీదుగా గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, ఏజెంట్లు ఉన్నారు. తనను ఆదరించి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం పనిచేస్తానని, అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తానని చెప్పారు.



ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరఫున ఆర్‌ఓ నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వై.ప్రదీప్ రెడ్డి

ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గెలుపుపై హర్షం



మారెమ్మ గుడి వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: మంత్రాలయం ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి విజయం సాధించడంతో మండల కేంద్రమైన కౌతాళంలోని మారెమ్మ దేవాలయంలో వైస్ సర్పంచ్ సక్రితిక్కయ్య, నాయకులు భీమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. బాలనాగిరెడ్డి నాల్గవసారి ఎమ్మెల్యేగా గెలిచి చరిత్ర సృష్టించారని తెలిపారు. అభిమాన నాయకుడికి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు వెంకటరామరాజు, ప్రహ్లాదరెడ్డి, లింగారెడ్డి పలువురు పాల్గొన్నారు.

అధ్వానంగా కడ్లమాగి రోడ్డు



రాళ్లు రప్పలు తేలి అధ్వాన్నంగా ఉన్న కడ్లమాగి రోడు



సైడ్‌వాల్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న పురాతన కాలం నాటి బ్రిడ్జ్

హొళగుంద: మండల పరిధిలోని కడ్లమాగి రోడ్డు పూర్తి అధ్వానంగా తయారైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాళ్లు తేలి మోకాల్లోతు గుంతలున్న ఈ రోడ్డులో వర్షా కాలంలో ప్రయాణం నరకాన్ని చూపిస్తుంది. ఈ మార్గం రైతుల పొలాలకు, గజ్జహళ్లీ గ్రామానికి రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. గజ్జహళ్లీ గ్రామానికి చేరుకోవడానికి ఈ మార్గం 8 కిమీ ఉంటే చుట్టూ తిరిగి వెళితే దాదాపు 20 కి.మీ వరకు దూరం పెరుగుతుంది. ఉపాధి హామీ పథకం లేదా ఇతర అభివృద్ధి నిధులతో రోడ్డును బాగు చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు. అదేవిధంగా ఇదే రస్తాలో ఉన్న బ్రిటీష్ కాలం నాటి వంతెన ప్రమాద స్థాయికి చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. రక్షణగోడలు కూలిపోవడంతో రాత్రి సమయంలో ఎంతో మంది లోయలో పడి గాయాల పాలయ్యారు. చీకట్లో వంతెన ఉన్నట్లు వాహన చోదకులు గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు, కొత్త వంతెన ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జోరుగా సేద్యం

హొళగుంద/దేవనకొండ: ఇటీవల కురిసిన వర్షాలకు కర్షకులు సేద్యం పనులు మొదలుపెట్టారు. నైరుతి రుతుపవనాల రాకతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పొలాల్లో విత్తనాలు విత్తే పనులు చేపట్టారు. ఎక్కడ చూసిన పొలాల్లో విత్తనాలు వేస్తున్న కూలీలు, గుంటుక పొస్తున్న రైతులే కనబడుతున్నారు. తడి ఆరితే విత్తనాలు పెట్టడానికి వీలుకాదని ఇతర పనులు వదులుకుని భూమిల్లో విత్తు వేస్తున్నారు. ఇప్పటికే మార్ల మడికి వద్ద ఉన్న వేదావతి(హగరి) నదికి వరద రావడంతో నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న రైతులు పంటల సాగుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో రైతన్నలు హుషారుగా సేద్యానికి ఉపక్రమించారు.



హొళగుంద సమీపంలో గుంటక పొస్తున్న రైతు



విత్తనాలు విత్తుతున్న కూలీలు

సబ్సిడీ విత్తనాల పంపిణీ

ఆస్పరి: సబ్సిడీ వేరుశనగ విత్తనాలు స్టాక్ వచ్చిన తరువాత పంపిణీ చేస్తామని ఏఓ నరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం ఆస్పరిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఆస్పరి, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, చిగిళి, బిణిగేరి, నగరూరు, తంగరడోణ, బిల్లేకల్లు, ముత్తుకూరు, కైరుప్పల, కారుమంచి, ములుగుందం, బనవనూరు గ్రామాలలో ఆర్‌బీకేల ద్వారా 1,083 మంది రైతులకు 900 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామన్నారు. మండలానికి 2,600 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపగా 900 క్వింటాళ్లు మంజూరైయ్యాయన్నారు. ప్రస్తుతానికి విత్తనాలు అయిపోయినాయని, వచ్చిన తరువాత పంపిణీ చేస్తామని చెప్పారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: వర్షాలు పడుతున్న తరుణంలో విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి తెలిపారు. రెండు రోజుల క్రితం వర్షాలకు దెబ్బతిన్న లైన్లకు చేపడుతున్న మరమ్మతు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షంలో తడిసిన స్తంభాలను తాకడం, మోటార్ల దగ్గర రైతులు స్టాటర్లను పట్టుకోరాదని చెప్పారు. అలాగే ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో ఇంట్లో టీవీలు, ఫ్యాన్ల స్విచ్ ఆఫ్ చేసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పండ్ల తోటల సాగుకు ముందుకు రండి

మద్దికెర: మండలంలో వ్యవసాయ బావులు కలిగిన రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకు రావాలని ఏపీఓ నర్సిరెడ్డి మంగళవారం తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తున్నారు. మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు అందజేస్తుందని, దాదాపు 20 రకాలు పండ్ల మొక్కలు ఇస్తామని, వీటికి నీటి అవసరం తక్కువగా ఉంటుందని చెప్పారు. 5 ఎకరాలలోపు ఉన్న రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదోని ఎమ్మెల్యేగా పార్థసారథి జయకేతనం



డాక్టర్ పార్థసారథి

ఆదోని టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఆదోని నియోజకవర్గం నుంచి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి 18,164 ఓట్ల మెజారీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. ఆదోనిలో మొదటినుంచి సాయిప్రసాద్‌రెడ్డి మరోమారు ఎమ్మెల్యేగా విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తారని పరిశీలకులు భావించారు. అయితే అనూహ్యంగా మంగళవారం కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో సాయిప్రసాద్‌రెడ్డి ఓటమి పాలు కావడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. స్థానిక అభ్యర్థి గాకుండా ఇతర ప్రాంతం నుంచి వచ్చి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి డాక్టర్ పార్థసారథి గెలుపొందడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.

రౌండ్ల వారీగా ఆయా పార్టీలకు పోలైన ఓట్లు, ఆధిక్యం

రౌండ్	వైఎస్సార్‌సీపీ	కూటమి (బీజేపీ)	కాంగ్రెస్	బీజేపీ ఆధిక్యం
1	5169	5431	561	262
2	9207	11063	938	1856
3	12970	15679	1295	2709
4	16973	21710	1571	4737
5	21841	27491	1811	5650
6	25434	32550	2047	7116
7	29243	37653	2265	8410
8	32351	44060	2627	11709
9	36549	48437	3189	11888
10	40318	51673	3637	11355
11	44282	56189	4218	11907
12	48939	59227	4746	10288
13	52844	63689	5350	10845
14	57280	67035	5980	9755
15	61779	71213	6601	9434
16	64790	77414	6909	12622
17	67124	81726	7125	14602
18	70418	87357	7469	16939
19	71297	88943	7567	17646

వీటితో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొత్తం 1454 కాగా, ఇందులో వైఎస్సార్‌సీపీకి 468 ఓట్లు, బీజేపీకి 986 ఓట్లు పోలయ్యాయి.

బీవీని వరించిన గెలుపు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు నియోజకవర్గ స్థానానికి జరిగిన ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సమీప వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుట్టారేణుకపై 14,816 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 20 రౌండ్లలో జరిగిన కౌంటింగ్‌లో బీవీ జయనాగేశ్వర్ రెడ్డికి 1,01,212 ఓట్లు పోలవగా బుట్టా రేణుకకు 86,396 ఓట్లు పోలయ్యాయి. ఇండియన్ కాంగ్రెస్ అభ్యర్థి ఖాశింవలికి 7,748 ఓట్లు, బహుజన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి కె.రాఘవేంద్రకు 884 ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులు విజయలక్ష్మికి 461 ఓట్లు, మిట్టి రాజశేఖర్‌కు 388 ఓట్లు, గువ్వలనారాయణకు 248 ఓట్లు, జగన్నాథ ఈరన్నకు 225 ఓట్లు, కె.నాగర్జునరెడ్డికి 181 ఓట్లు, గొల్ల ఈరన్నకు 134 ఓట్లు, నోటాకు 2,357 ఓట్లు పోలయ్యాయి.



ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి

కోసిగిలో పకడ్బందీగా 144 సెక్షన్



కోసిగిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రోడ్డు



నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

కోసిగి: సార్వత్రిక ఎన్నికల కౌటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేశారు. కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలతో పాటు కోసిగిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం వారపు సంత కావడంతో ముందస్తుగానే పశువుల సంత మార్కెట్, కూరగాయల మార్కెట్, వ్యాపార దుకాణాలు, చికెన్, మటన్, కిరాణం తదితర అన్నీ దుకాణాలను బంద్ చేశారు. ప్రధాన రోడ్డు వెంబడి, సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలలో పోలీసులు బందోబస్తు కొనసాగించారు. రోడ్లపై ఎవరూ అల్లర్లు సృష్టించకుండా చర్యలు తీసుకున్నారు.

గ్రామాల్లో పటిష్ట బందోబస్తు

గోనెగండ్ల: ఎన్నికల కోడ్, 144 సెక్షన్, పోలీస్ 30 యాక్టు అమల్లో ఉన్న నేపథ్యంలో గోనెగండ్ల మండలంలో సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు అన్ని గ్రామాల్లో మంగళవారం గస్తీ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉదయం నుంచి ప్రారంభం అయ్యింది. ఆ తర్వాత గ్రామాల్లో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. మండలంలో మొబైల్ పోలీస్ టీమ్, పికెట్ టీమ్ ఉదయం నుంచి మండలం మొత్తం అన్ని గ్రామాల్లోని వీధుల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకోని ఆయా పార్టీ నాయకులు సంయమనం పాటించాలని ర్యాలీలు, సభలు, సమావేశాలు వంటివి నిర్వహించరాదని సూ చించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన ఎన్నికల ప్రక్రియ

ఆదోని సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల ఉత్కంఠకు మంగళవారం వెలువడిన ఫలితాలతో తెరపడింది. విజేతను ప్రకటించడంతో ఎన్నికల ప్రక్రియ ముగిసినట్లయ్యింది. ఆదోని నియోజకవర్గం నుంచి ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వై.సాయిప్రసాద్ రెడ్డి కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి డాక్టర్ పార్థసారథి పోటీపడ్డారు. నియోజకవర్గంలో 2,63,058 మంది ఓటర్లు ఉండగా అందులో 1,75,064 మంది ఓటర్లు తమ ఓటు హక్కును మే 13వ తారీఖున జరిగిన ఓటింగ్‌లో వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1698, ఓట్ ఫ్రమ్ హోమ్ కింద 59 మంది ఓటు వేశారు. ఫలితాలు వెలువడడానికి 21 రోజులు గ్యాప్ రావడంతో నియోజకవర్గ ప్రజలు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూశారు. మంగళవారం కర్నూలు రాయలసీమ యునివర్సిటీలో ఎన్నికల కౌంటింగ్ జరిగింది. నియోజకవర్గానికి సంబంధించి ఓట్లను లెక్కించేందుకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 19 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి ఉమ్మడి కూటమి అభ్యర్థి పార్థసారథి ఆధిక్యం సాధిస్తూవచ్చారు. 19 రౌండ్లు పూర్తయ్యేసరికి 18569 ఓట్లతో విజయం సాధించారు. దీంతో పట్టణంలో కూటమి కార్యకర్తలు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మరీ బైపాస్ సర్కిల్‌లో పెద్దఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కొంతమంది కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

భూమికి బలం.. రైతుకు ప్రయోజనం

- సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు
- కంపోస్టు ఎరువులతో ప్రయోజనం
- ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్న రైతులు

నందవరం: సహజ సిద్ధంగా ప్రకృతిలోని వ్యర్థాల నుంచి తయారయ్యేవే సేంద్రియ ఎరువులు. ఈ ఎరువులతో భూమికి బలం పెరిగి నేల సారవంతమవుతుంది. తద్వారా మంచి పంటలు పండి రైతులు అధిక దిగుబడులు పొందుతారు. మొక్కలు, పశువులు, గొర్రెలు, కోళ్లు, ఇతర జంతువుల వ్యర్థాల నుంచి తయారయ్యే సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల భూమికి బలం చేకూరుతుంది. తద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు. ఇటీవల సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన పెరిగింది.

- రసాయన ఎరువుల వాడకం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు వేసిన పంటలకు అనేక రకాల చీడపీడలు వ్యాపిస్తున్నాయి.
- సేంద్రియ ఎరువుల వాడకంతో భూమి సారవంతమై, నాణ్యమైన దిగుబడులు రావడంతో అన్నదాతలు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు.
- మెట్ట భూములలో పశువుల ఎరువులను వాడకం మంచి ఫలితాలనిస్తుంది.
- సాగు చేస్తున్న పంటలకు పోషకాలను అందించడంతో పాటు పొలంలో కురిసిన వర్షపు నీటిని ఒడిసి పట్టి పంటలకు అందించడంలో పశువుల పేడ కీలక పాత్ర పోషిస్తుంది.
- పశువుల ఎరువును పొలంలో చిన్న చిన్న కుప్పలుగా పోసి తొలకరి వర్షలు కురిసిన వెంటనే ఆ కుప్పలను పొలం అంతా చల్లుకోవాలి. అప్పుడే ఎరువులోని పోషకాలు భూమికి పుష్కలంగా అందుతాయి.
- పల్లెల్లో లభించే చెత్త, ఆకులు, ఇతర కలుపు మొక్కలు, కుళ్లిన కూరగాయలు, వేరుశనగకాయల పొట్టు, పశువుల పేడ, పశువుల మూత్రంతో కుళ్లింపజేస్తే..అది కంపోస్టు ఎరువుగా తయారవుతుంది. ఇది పంటలకు వేస్తే మొక్కలు బలంగా, ఏపుగా పెరగడంతో పాటు పంటలకు చీడపీడలు సోకవు. దీంతో మంచి దిగుబడి వస్తుంది.
- కోళ్ల ఫారాల్లో కోళ్లకు వేసిన పొట్టు మలమూత్రాలతో కలిపి కుళ్లిన వ్యర్థాలతో సేంద్రియ ఎరువుగా తయారవుంది. ఈ ఎరువులో 3 శాతం నత్రజని, 2 శాతం భాస్వరం, 2 శాతం పొటాష్ పోషకాలు ఉంటాయి. తేమ తగ్గే కొద్ది పోషక శాతం పెరుగుతుంది.
- వానపాముల ఎరువు సైతం నేలను సారవంతం చేస్తుంది. ఈ ఎరువు పంటలకు వేయడం ద్వారా మొక్క బలంగా, ఏపుగా పెరిగి మంచి దిగుబడులు ఇస్తుంది. చీడపీడలు దరి చేరవు.



జొహరాపురం వద్ద పొలంలో జీవాల మందను నిలిపి ఎరువు చేస్తున్న దృశ్యం



పొలంలో ఎరువు చల్లుతున్న రైతన్నలు

సేంద్రియ ఎరువులకు పెరిగిన గిరాకీ



పల్లెల్లో రైతులు తమ పొలాలకు సేంద్రియ ఎరువులు వేసేందుకు మొగ్గు చూపడంతో వాటికి గిరాకీ పెరిగింది. నాకున్న రెండెకరాల పొలంలో 5 రోజుల పాటు జీవాల మందను నిలిపాను. రోజుకు రూ.2 వేల చొప్పున 5 రోజులకు రూ.10 వేలు ఖర్చయ్యింది. జీవాల వ్యర్థాలతో భూమికి బలం చేకురుతుంది. రెండు, మూడు సంవత్సరాల పాటు పంటలకు పోషకాలు లభిస్తాయి. రసాయన ఎరువులను ఎక్కువగా వినియోగిస్తే పెట్టుబడులు పెరగడంతో పాటు ప్రయోజనం తక్కువగా ఉంటుంది.

– కురవ భీరప్ప, రైతు, జొహరాపురం

జీవాల పెంపకం భారమవుతోంది



ప్రస్తుతం పెరిగిన ధరల కారణంగా జీవాల పెంపకం భారమవుతోంది. మాకున్న 2వేల జీవాలను ఎకరం పొలంలో ఒక రాత్రి నిలిపితే రూ.2 వేలు వస్తుంది. మందకు కాపలా ఉన్న కూలీలకు సంవత్సరానికి రూ.లక్ష చొప్పున ముగ్గురికి మూడు లక్షలు ఖర్చువుతుంది. జూన్ నుంచి నవంబరు వరకు అడవులలో జీవాలు మేత మేయడంతో ఖర్చు ఉండదు. డిసెంబరు నుంచి మే వరకు జీవాలకు గ్రాసం దొరకదు. గ్రాసం కొనుగోలు చేసి అందించాల్సిందే. ఒక్కొక్క గొర్రె పోషణకు రోజుకు రూ.20 ఖర్చు వస్తుంది.

– భీరప్ప, జీవాల యజమాని, బెల్గాం

సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాం



గ్రామాలలో రైతులను సేంద్రియ ఎరువులు వాడే విధంగా ప్రోత్సహిస్తున్నాం. అలాగే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం. జీవామృతం, భీజామృతం, ఘనజీవామృతం వంటి కషాయాలను వినియోగించి పంటల సాగులో వినియోగించేలా కృషి చేస్తున్నాం. సేంద్రియ ఎరువుల వల్ల భూమి సారవంతమై మొక్కలకు పోషక లవణాలు అందడంతో ఏపుగా పెరిగి అధిక దిగుబడులను సాధించవచ్చు. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతో రసాయన ఎరువుల వాడకాన్ని చాలా వరకు తగ్గిస్తున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది.

– మర్రి స్రవంతి, వ్యవసాయాధికారిణి